క్లుప్తంగా

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలి



పామర్రు: ఆధ్యాత్మిక భావనను ప్రతిఒక్కరూ పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాల రోడ్డులో వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి ఇంటి వద్ద జరిగిన కార్తిక వన సమారాధనలో ఆయన మాట్లాడారు. వన సమారాధనలవంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలన్నారు. కలిసి మెలిసి నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఉపసర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు డీడీ ప్రసాద్, పెద వెంకటరెడ్డి, మర్రెడి అంజిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అపరాల పైరుకు బీమా ప్రీమియం చెల్లించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో రబీ పంటగా సాగు చేసే అపరాల పైరుకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి వి.వేణుమాధవ్ కోరారు. మండలంలోని చినకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో జరుగుతున్న సార్వా వరి కోతలను శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరాకు మినుము పైరుకు రూ.60 ప్రీమియం చెల్లించాలన్నారు. మినుము సాగు చేసే రైతులు విధిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీని వలన రసం పీల్చే పురుగుల నుంచి పైరుకు రక్షణ కల్పించవచ్చన్నారు. విత్తనశుద్ధికి కిలో మినుము విత్తనాలకు ఇమిడా కోప్లరేడ్ అనే మందును రెండు మిల్లీలీటర్లు విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టుకుని విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు.

19న లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 19న లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన భక్తులు రూ. 516 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తి మార్గాన్ని అనుసరించాలి



పామర్రు: కార్తిక మాసంలో ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కొల్లి చలమారెడ్డి నివాస గృహంలో వైస్ ఎంపీపీ ఆరేమళ్ల రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వల్లూరిపల్లి గణేష్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఎంపికలో 30 మందికి ఉద్యోగాలు



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 30 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. బెంగళూరుకు చెందిన టెస్ట్ యంత్రా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ క్యూ స్పైడర్స్ నిర్వహించిన ఈ ఎంపికలో 150 మంది విద్యార్థులు పాల్గొనగా 30 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ఆయన తెలిపారు. కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్. నవీన్ పాల్గొన్నారు.

స్కేటింగ్ స్కూటర్ పోటీలకు విద్యార్థి ఎంపిక



పామర్రు: జాతీయ స్కేటింగ్ స్కూటర్ పోటీలకు పామర్రుకు చెందిన విద్యార్థి డానిష్ సమర్‌కుమార్ ఎంపికయ్యారు. విశాఖ నగరంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కూటర్ పోటీల్లో విజేతగా నిలిచిన డానిష్ సమర్‌కుమార్ జాతీయ రోలర్ స్కూటర్ పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్ 5,6 తేదీల్లో బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి డానిష్ సమరకుమార్ ఎంపికైనట్లు అతని తల్లి స్వర్ణ వాహిని శుక్రవారం విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమర్‌కుమార్‌ను కోచ్ నాగసేన్ అభినందించారు.

క్యారేట్

ఉల్లిపాయల ధరలు కొండెక్కాయి. అదేవిధంగా క్యారెట్ కూడా పెరిగి పోవటంతో ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదంటూ వినియోగదారులు వాపోతున్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటిన విషయం తెలిసిందే. దీంతో కనీసం తినేందుకు కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొండెక్కిన ఉల్లి ధరలు
- అదే బాటలో క్యారెట్ ధర

గుడ్లవల్లేరు: నిత్యావసర వస్తువులు, కూరగాయలు, నూనెలు ఒకటేమిటి అన్ని ధరలు ఆకాశాన్నంటుతుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. పాలకులు, అధికారులు ధరలను నియంత్రించడంలో విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు బజారుకు నాసి రకం ఉల్లిపాయలు వస్తుండటంతో వీటిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపటం లేదు. ఇదే అదునుగా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ మార్కెట్‌లో రెట్టింపు ధరల కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వానికి పట్టడం లేదు.

రోజుకో రేటు

మార్కెట్‌లో ఉల్లిపాయలు రోజుకో రీతిన విక్రయించటంతో వినియోగదారునకు భారమవుతోంది. విపరీతమైన ధరలకు అమ్ముతున్నా కొనుగోలు చేయక తప్పటం లేదు. వ్యాపారులు సృష్టించే ఈ కృత్రిమ కొరత కారణంగానే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉల్లిపాయలు, క్యారెట్ వంటి సరుకులు సవ్యంగా సరఫరా కాకపోవటంతో తమ వ్యాపారాలు అంతంత మాత్రంగానే

కిలో	వారం క్రితం ధర	ప్రస్తుత ధర
ఉల్లిపాయలు	రూ.40	రూ.80
క్యారెట్	రూ.52	రూ.80





ఉన్నాయని దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లిపాయలు వారం కిందట కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.80కి పెరిగింది. క్యారెట్ వారం కిందట కిలో రూ.52 ఉండగా ఇప్పుడు రూ.80కి చేరింది. నూనెలు కిలో రూ.30 నుంచి రూ.40కు పెరిగిన విషయం తెలిసందే. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని ధరలను అదుపులో ఉంచితే పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేసిన వారు అవుతారని వినియోగదారులు అంటున్నారు.

ఉల్లి ధరలు విపరీతం



ఉల్లిపాయల ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. రోజుకో ధరను మారుస్తున్నారు. ఈరోజు ఉన్న రేటు రేపు ఉండటం లేదు. కిలో రూ.80 అంటే మా వంటి మధ్యతరగతి కుటుంబాలు ఎలా కొనుక్కొని తినాలి. నిత్యావసరాల ధరలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఏ పనులు లేని ఈ కార్తిక మాసంలో ఇబ్బందులు తప్పవు.

– మామిళ్ల జీవన్‌రాజ్, గుడ్లవల్లేరు

ఏం కొనేటట్టు లేదు



మార్కెట్‌కు వెళితే ఏం కొనేటట్టు లేదు. ఉల్లిపాయల ధరలకు రెక్కలొచ్చాయంటే.. అది ఒక్కటే కాదు.. అన్ని రకాల సరుకులు, కూరగాయల ధరలను రెట్టింపు చేస్తున్నారు. వారం క్రితం కొన్న ధరలు ఈ రోజు ఉండటం లేదు. ప్రభుత్వం ధరలను నియంత్రించకపోతే మాలాంటి కుటుంబాలకు ఇబ్బందే.

– కోంద్రు దుర్గమ్మ, గుడ్లవల్లేరు

వైఎస్సార్ సీపీ నేతలకు డీఎన్నార్ పరామర్శ



వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న డీఎన్నార్

కలిదిండి(కైకలూరు): ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కలిదిండి మండలం పెదలంకలో పలువురు పార్టీ నాయకులను శుక్రవారం పరామర్శించారు. పోకల నాగేశ్వరరావు, పోతల శ్రీనివాస్ ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అదేవిధంగా ప్రసవ వేదన సమయంలో మృతి చెందిన అరవ మాధవి, స్వల్ప అస్వస్థతకు గురైన దున్న గణపతి కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం కలిదిండిలో అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బ్రహ్మాజీరావు, నాయకులు మోకా రామకృష్ణ, ముద్దం రంగబాబు, ఐయినాల సత్యనారాయణ, దుగ్గిరాల నాగు పాల్గొన్నారు.

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వానిదే



పెనుమాకలంకలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మండవల్లి: కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వానిదేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మండలంలోని పెనుమాకలంక గ్రామాన్ని కొల్లేరు పరిరక్షణలో భాగంగా శుక్రవారం సందర్శించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ కొల్లేరు మాఫియా కబంధ హస్తాల్లో కొట్టుమిట్టాడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందల ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చేపల చెరువులను తవ్వి సహజసిద్ధమైన కొల్లేరును నాశనం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు వరకా శ్యామల, సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సర్పంచ్ ముంగర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో జ్ఞానం



మొవ్వలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథ పఠనంతో విద్యార్థుల్లో, జ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతుందని ఎంపీటీసీ సభ్యుడు యెర్నేని అరవింద్ పేర్కొన్నారు. మండలంలో జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ధ్యాన మాస్టర్ సిరిపురపు లలితాప్రసాద్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో చిన్నారులకు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి.వెంకటరమణ, చెస్ టీచర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

కైకలూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కలిదిండి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తహసీల్దారు ఎల్‌వీఎస్ రామకృష్ణ ప్రారంభించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్ ఆధ్వర్యంలో పిల్లలకు పద్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మలత, నరసింహారావు పాల్గొన్నారు.

కైకలూరులో..

కై కలూరు శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రముఖ సాహితీవేత్త చింతపల్లి వెంకట నారాయణ ప్రారంభించారు. స్వాతంత్ర్య సమర యోధుల పుస్తకాలతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. గ్రంథాలయాధికారి శ్రీనివాస్, సిబ్బంది శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతి ప్రసాద్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, గ్రంథాలయాధికారి పర్వీన అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎస్సై రామచంద్రరావుతో కలిసి వారు వీక్షించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: చిరిగిన చొక్కా తొడుక్కున్నా.. ఒక మంచి పుస్తకం కొనుక్కుంటే మనిషి జ్ఞాన సంపదను సముపార్జించుకోవచ్చని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. మండలంలోని అంగలూరుతో పాటు గుడ్లవల్లేరు గ్రంథాలయాల్లో శుక్రవారం గ్రంథాలయ ఉత్సవాలను పురస్కరించుకుని పుస్తక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

మొవ్వ: విద్యార్థులు పుస్తక పఠనాన్ని ఓ దిన చర్యగా అలవర్చుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సబ్బినేని సాంబశివరావు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మొవ్వ తృతీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కృష్ణకుమారి పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తహసీల్దార్ జేఎస్ సుభాని అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వీఎస్ వీరభద్రరావు లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



పామర్రులో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



గుడివాడలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



దోకిపర్రులో కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

గుడ్లవల్లేరు: మండలంలోని ఆలయాలు కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకునేందుకు ఆలయాల్లో భక్తులు బారులు తీరారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం

వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం చండీ హోమాన్ని నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో కొండలమ్మ ప్రసాదాలు

గుడ్లవల్లేరు: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని వేమవరం కొండలమ్మ అమ్మవారి ప్రసాదాలను మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో పర్యాటకులు, భక్తులకు శుక్రవారం అందించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వంద కిలోల పులిహోర ప్రసాదాన్ని బీచ్‌లో అందించినట్లు ఈఓ కొండలరావు తెలిపారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని ఆలయాల్లో శుక్రవారం కార్తికపౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం పూజలు నిర్వహించారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం, శోభనాద్రిపురం విశ్వేశ్వరస్వామి ఆలయం, మండవల్లి శ్రీ షిర్డీసాయిబాబా ఆలయాల్లో అర్చకులు పూజలు నిర్వహించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కార్తిక పౌర్ణమి పూజలు శుక్రవారం నిర్వహించారు. అల్లూరు పార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి, గురజ రామలింగేశ్వరస్వామి, వడాలి శ్రీవిశ్వేశ్వరస్వామి, సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వర స్వామి తదితర ఆలయాల్లో మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు.

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని మొవ్వ మండలంలోని శివాలయాలకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. కూచిపూడి శ్రీ బాలా త్రిపురసుందరి సమేతరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి దీపాలు వెలిగించారు.

కార్తిక శోభ

పామర్రు: కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం పలు శైవాలయాలు కార్తికశోభతో కళ కళలాడాయి. స్థానిక సోమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు పూజలుచేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించారు. స్థానిక అంకమ్మ తల్లి, విష్ణాలయంలో భక్తులు విశేషంగా పూజలు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

గుడివాడ టౌన్: స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.రామకృష్ణమాచార్యులు, ట్రస్టీ మాదాసు వెంకట లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

కనులపండువగా కోటి దీపోత్సవం

గుడ్లవల్లేరు: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని డోకిపర్రు భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్, దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసి ఈ దీపోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులకు దేవస్థాన ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. ఆలయ నిర్వాహకులు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు, పురిటిపాటి సుమలత దంపతులు పాల్గొన్నారు.

జ్వాలా తోరణం

గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయం, కొతవరం గౌతమేశ్వరాలయం, వడ్లమన్నాడు ద్రోణేశ్వరాలయాల్లో జ్వాలా తోరణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వడ్లమన్నాడు రైతు క్లబ్ కన్వీనర్ పెన్నేరు ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబ ఆలయంలో..

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ ఆలయంలో రామలింగేశ్వర, రామేశ్వర, కనకలింగేశ్వర శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు.



దోకిపర్రులో నిర్వహించిన దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

పశువులను రోడ్లుపై వదిలేస్తే కఠిన చర్యలు

గుడివాడ టౌన్: పట్టణానికి చెందిన పశుపోషకులు వాటిని తమ నివాసాల వద్దే బంధించాలని అలా చేయని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో రోడ్లపై పశువులు సంచరించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. దీంతో వాటిని కట్టడి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అందుకే అందుబాటులో ఉన్న బందెల దొడ్డి శుభ్రపర్చి సుమారు 80 పైబడి పశువులను బంధించినట్లు తెలిపారు. వాటిని విడిపించుకు వెళ్లాలంటే పశువుల యజమాని రోజుకు రూ.1,000 చెల్లించాలన్నారు. మూడు రోజులు వీటికి మేత, నీటి సరఫరా ఉంటుందని అనంతరం కూడా యజమానులు స్పందించని పక్షంలో వీటిని గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. బందెల దొడ్డి నిర్వహణ నిరంతరం కొనసాగుతుందని, పశువులు రోడ్లపై వదిలితే ప్రతి రోజు వాటిని బంధించడం జరుగుతుందన్నారు.

గ్రామాల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు



గుడివాడరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకునేందుకు ముందస్తు ప్రణాళికలను అధికారులు రూపొందించాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ అంశంపై ప్రజాప్రతినిధులు, సచివాలయ, వెలుగు అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక పవిత్రోత్సవాలు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో మహాపూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. అనంతరం యాగ్నిక బ్రహ్మలను ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. వేణుగోపాలరావు సత్కరించారు.

శ్రీచైతన్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



గుడివాడరూరల్: గుడివాడ శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి తొమ్మిదో తేదీ వరకు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 36వ అంతర్ జిల్లాల ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో కళాశాల విద్యార్థి ఎం.యశ్వంత్ బాలుర విభాగంలో బంగారు పతకాన్ని, మిశ్రమ జట్టు విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారన్నారు. ఈ నెల 8,9,10 తేదిల్లో శ్రీకాకుళం జిల్లాలో జరిగిన బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కళాశాల విద్యార్థి కె.ఫరీద్ బంగారు పతకాన్ని సాధించాడని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలి

గుడివాడ టౌన్: టిడ్కో గృహాల నివాసితులకు మౌలిక వసతులు తక్షణమే కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం టిడ్కో గృహాలు నిర్మించి లబ్ధిదారులకు అందజేశారని, తాగునీరు సరఫరా కోసం వాటర్ ట్యాంక్ నిర్మించారన్నారు. దానికి సరైన మార్గంలో నీటిని అందించే చర్యలు అధికారులు తక్షణమే చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18 మద్యం సీసాలు స్వాధీనం

గుడివాడరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై దాడులు నిర్వహించి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ పి.హేమసుస్మిత తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ ఆదేశాల మేరకు గుడ్లవల్లేరు మండలం గుడ్లవల్లేరు వాసి వెలగపల్లి నానిబాబు బెల్టుషాపు ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారనే సమాచారంతో అతని ఇంటిపై దాడి చేసి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుడివాడలోని వెన్నా రాజేష్ ఇంటిపై దాడి చేసి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. బెల్టుషాపులు నిర్వహించే వారి సమాచారాన్ని ఎక్సైజ్‌శాఖ, పోలీసులకు అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

గౌడ సంఘ వన సమారాధన కమిటీ చైర్మన్‌గా గణేష్

మండవల్లి: కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం కార్తీక వన సమారాధన కమిటీ చైర్మన్‌గా పడమట గణేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు అధ్యక్షతన కార్తీక వన సమారాధన ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు పోసిన చెంచురామారావు, వీరమల్లు నరశింహారావు, పరసా ఏడుకొండలు, పాపారావుగౌడ్, సురేష్, కిషోర్, నాగరాజు పాల్గొన్నారు.